క్లుప్తంగా

ఆరుతడి పంటలకు ఊపిరి



ఈలకొలనులో వర్షాలకు కళకళలాడుతున్న మొక్కజొన్న తోట

రంగంపేట: వేసవి ఉష్ణోగ్రతలతో సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ఆరుతడి పంటలకు శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షం ఊపిరిపోసింది. వర్షం ప్రభావంతో మెట్ట ప్రాంతం ముద్దయింది. దీంతో ఆరుతడిగా సాగయ్యే ఉద్యాన పంటలైన కూరగాయలు, మిరప, మొక్కజొన్న, పామాయిల్, పండ్ల తోటలకు నీరు అందింది. ఈ వర్షం కారణంగా రంగంపేట, వడిశలేరు, కోటపాడు, సింగంపల్లి, మర్రిపూడి, నల్లమిల్లి, జి.దొంతమూరు, ఈలకొలను, ముకుందవరం తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న ఉద్యానవన పంటలకు సరిపడా నీరు లభ్యమైందని రైతులు అంటున్నారు. ఈ వర్షం వల్ల మెట్ట ప్రాంత రైతులకు ఎంతో మేలు చేకూరిందని ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

రంగంపేట: మండలంలోని వెంకటాపురం గ్రామంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో స్థానిక విశ్వాసుల ప్రార్థనా మందిరంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 180 మందికి పరీక్షలు నిర్వహించారు.

సారా బట్టీలపై దాడి



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కోరుకొండ: గోకవరం మండలం వెదురుపాక గ్రామంలో సారా బట్టీలపై కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం దాడి చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

బిక్కవోలు: అన్నదాత సుఖీభవ పథకం వర్తించాలంటే మండలంలోని రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో సామ్యూల్ జాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-కేవైసీ చేయించుకుంటేనే రైతులకు పథకం కింద పెట్టుబడి సాయం మంజూరవుతుందని చెప్పారు. ఈ నెలలోనే అన్నదాత సుఖీభవ నగదు జమయ్యే అవకాశం ఉందన్నారు. రైతులంతా వెంటనే ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు. గ్రామ రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ-కేవైసీ బయోమెట్రిక్ మాత్రమే అవుతుందని తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



విజయ దుర్గాంబిక అమ్మవారు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో మంచినీటి చెరువు వద్ద ఉన్న విజయ దుర్గాంబిక ఆలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు నారాయణ శర్మ తెల్లవారుజామున అమ్మవారిని సుందరంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మెగా జాబ్‌మేళా

అనపర్తి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, సీడాప్ ఆధ్వర్యంలో అనపర్తిలో జరిగిన మెగా జాబ్‌మేళాలో 170 మంది ఔత్సాహికులు ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం అనపర్తిలో జరిగిన మేళాను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. యువతకు ఈ జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇలాఉండగా నియోజకవర్గ స్థాయిలో అభివృద్ధిపై విజన్–2047 పేరిట ఎమ్మెల్యే అధ్యక్షతన స్థానిక ఎస్సార్నార్ కాంప్లెక్స్‌లో సమీక్షా సమావేశం జరిగింది.

పునీత ఆంథోని పండగ



వాక్య సందేశమిస్తున్న రెవరెండ్ ఫాదర్ మాణిక్యం

కోరుకొండ: క్రైస్తవుల ఆరాధ్య దైవం క్రీస్తు ప్రభువు వాక్యాన్ని ప్రపంచవాప్తంగా చాటి చెప్పిన పునీతుడు ఆంథోని అని ఆర్‌సీఎం చర్చి రెవరెండ్ ఫాదర్ మాణిక్యం తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్ఆర్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో పునీత ఆంథోని పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఫాదర్ మాణిక్యం వాక్య సందేశమిచ్చారు. కార్యక్రమంలో ఉపదేశి బెల్లపు డేవిడ్, కోరుకొండ, కూనవరం, కాపవరం, బూరుగుపూడి గ్రామాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

తలదున్నేలా..

- డ్రమ్ సీడర్‌తో వరి నాట్లు
- ఖర్చు తక్కువ, దిగుబడి ఎక్కువ
- నీటి సమస్యకు పరిష్కారం!

రాజానగరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఖరీఫ్‌లో వరి సాగును చేపట్టేందుకు డ్రమ్ సీడర్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. దీనివల్ల సమయం ఆదా కావడంతో పాటు, శ్రమ, ఖర్చు తగ్గుతాయి. ఆధునిక సాంకేతిక విజ్ఞానంతో విత్తన శుద్ధి మొదలుకొని వరి కోత కోసి, నూర్చే వరకు అన్ని దశల్లోను నేడు యంత్రాల వినియోగం పెరిగింది. నారుమడి వేయడం, ఆకు తీయడం, నాట్లు వేయడం వంటి ప్రక్రియల్లో చాలామంది రైతులు ఇప్పటికీ ఎక్కువగా యంత్రాలను వినియోగిస్తున్నారు. డ్రమ్ సీడర్‌తో వీటిని కూడా అధిగమించవచ్చని కేవీకే సేద్య పంటల విభాగం రిటైర్డ్ అధికారి ఎస్.జితేంద్రనాథ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా విశదీకరించారు.

డ్రమ్ సీడర్ పరికరంతో మొలకెత్తిన వరి విత్తనాలను నేరుగా పొలాల్లో విత్తడం ద్వారా పంట త్వరగా కోతకు రావడంతో పాటు, ఉత్పత్తి వ్యయం కూడా తగ్గుతుంది. దిగుబడి 5 నుంచి 10 శాతం వరకు పెరుగుతుంది. గత దశాబ్ద కాలంగా కేవీకే ద్వారా వివిధ గ్రామాల్లో ఈ పద్ధతిలో అనేక ప్రదర్శనా క్షేత్రాలను ఏర్పాటు చేసి, వరి సాగులో మంచి ఫలితాలు రాబట్టింది. ఈ పరికరం ఖరీదు రూ.4,888 కాగా, సబ్సిడీపై రూ.2,444కే కేవీకేలో అందజేస్తున్నారు.

నీటి సమస్యనూ అధిగమించవచ్చు

పొలంలో నేరుగా విత్తనాలు చల్లాలన్నా, మడులు కట్టి నారు పెంచాలన్నా పొలంలో సమృద్ధిగా నీరు ఉండాలి. అంతేకాక కూలీ సమస్య కూడా ఎదురవుతుంది. ఆయా సమస్యలను పూర్తిగా అధిగమించేందుకు పొలాల్లో నేరుగా డ్రమ్ సీడరుతో వరి విత్తనాలను నాటుకోవచ్చు. మొలకెత్తిన విత్తనం వేసేందుకు వీలున్న నాలుగు ప్లాస్టిక్ డబ్బాలను కలిపి, ప్రతి డబ్బాకు 20 సెం.మీ. దూరంలో రంధ్రాలు చేయాలి. పరికరం సులువుగా కదలటానికి ఇరువైపులా రెండు పెద్ద చక్రాలు ఏర్పాటు చేయాలి. దానిని లాగడానికి అనువుగా హ్యాండిల్‌ని కూడా ఏర్పాటు చేసుకోవాలి. ఇలా తయారుచేసిన తరువాత దీని బరువు పది కిలోలను మించి ఉండదు. కొద్దిగా మొలకెత్తిన విత్తనాలను ఆ నాలుగు డబ్బాల్లో పోసి, దమ్ము చేసి, చదును చేసిన పొలాల్లో పెట్టి ముందుకు లాగడం ద్వారా విత్తనాలను నాటుకోవచ్చు. ఈ విధంగా చేయడం వల్ల ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనం సరిపోతుంది. ఇద్దరు మనుషులు మూడు గంటల్లో ఎకరం పొలంలో ఇలా విత్తనాలు విత్తేందుకు అవకాశం ఉంది. ఒకసారి పరికరం లాగినప్పుడు 8 సాళ్లలో విత్తనం పడుతుంది. సాళ్ల మధ్య 20 సెం.మీ. ఎడం ఉంటుంది. పొలాన్ని సరిగా చదును చేయకపోతే ఈ పద్ధతిలో మొలక శాతం దెబ్బతిని, మొక్కల సాంద్రత తగ్గుతుంది.



డ్రమ్ సీడర్ పరికరంతో వరి విత్తనాలు చల్లుతున్న రైతు

పలచగా నీరు

విత్తనం విత్తేటప్పుడు పొలంలో బురదలా పదును ఉండి, నీరు పలచగా ఉండాలి. విత్తిన తరువాత రెండు, మూడు రోజులకు ఒకసారి పలచగా మడి ఆరకుండా తొడిగే వరకు నీరు పెడుతుండాలి. మొక్క నీటిలో మునగకూడదు. అవసరమైనప్పుడు నీరు బయటకు పోయేలా దారులు తీసుకోవాలి. విత్తిన 15 రోజులకు తొలి దఫా నత్రజని వేసే ముందు ఒత్తుగా ఉన్నచోట మొక్కలను తీసి, ఖాళీల్లో నాటుకోవడం మంచిది.

కలుపు నివారణ

డ్రమ్ సీడరుతో విత్తిన పొలంలో వరి, కలుపు మొక్కలు ఒకేసారి మొలుస్తాయి. ఈ కారణంగా విత్తిన 20 రోజుల వరకు చేతితో కలుపు తీయడానికి వీలుపడదు. కలుపు నివారణకు తప్పనిసరిగా రసాయన మందులు వాడాలి. గడ్డి జాతుల మొక్కలుంటే బ్యూటాక్లోర్ 50 శాతం లీటరు లేదా అనిలోఫాస్ 30 శాతం 500 మి.లీ. లేదా ప్రిటిలాక్లోర్ 50 శాతం 500 మి.లీ. ఏదో ఒక దానిని ఎకరానికి 25 కిలోల పొడి ఇసుకలో కలిపి, నాటిన మూడు నుంచి ఐదు రోజుల్లో పలచగా నీరు పెట్టి, సమానంగా వెదజల్లాలి. నాటిన 25 నుండి 30 రోజుల వ్యవధిలో పొలంలో వెడల్పాటి కలుపు మొక్కల ఉధృతి ఎక్కువగా ఉంటే, ఎకరానికి 400 గ్రా. 2 లేదా 4డి సోడియం సాల్ట్ 80 శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి, పొలంలో నీటిని తీసివేసి కలుపుపై పడేలా పిచికారీ చేయాలి. అన్ని రకాల కలుపులను 20 రోజుల్లో బైస్పోరిబాక్ సోడియం 10 శాతం ద్రావణం 100 మి.లీ.ను ఎకరానికి పిచికారీ చేసి నివారించవచ్చు.

కోర్టు తీర్పు కూటమి సర్కారుకు చెంపదెబ్బ

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టుపై సర్వోన్నత న్యాయస్థానం తీర్పు రెడ్‌బుక్ రాజ్యాంగాన్నే నమ్ముకున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి చెంపదెబ్బ అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఏడాది కాలంగా పాలన పక్కనపెట్టి, అధికార మదంతో కూటమి ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ, రెడ్ బుక్ రాజ్యాంగంతో ప్రజలు, ప్రతిపక్షాలపై బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. కొమ్మినేనిని అరెస్టు చేయడం ద్వారా ప్రభుత్వ లోటుపాట్లు ఎత్తి చూపే కొద్దిపాటి మీడియా హౌస్‌లను బెదిరించి, తమ దారికి తెచ్చుకోవాలన్న ఎత్తుగడ సుప్రీం కోర్టు వ్యాఖ్యలతో నీరు గారిపోయిందన్నారు. సాధారణ విషయాన్ని రాజకీయం చేసి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను దూషిస్తూ, సాక్షి ఆస్తులను ధ్వంసం చేస్తూ నాలుగు రోజులుగా నానాహంగామా సృష్టించి, హింసను ప్రేరేపించిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులకు కోర్టు తీర్పుతో తెల్లముఖాలేసుకునే పరిస్థితి ఎదురైందని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో ఈ దౌర్జన్యాలకు తెగబడిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా లెక్కలు సరిచూస్తామని స్పష్టం చేశారు.

విమాన ప్రమాద సంఘటన బాధాకరం

గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్ విమాన దుర్ఘటన అత్యంత బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో విమానంలోని 229 మంది ప్రయాణికులే కాకుండా, విమానం కూలిన ప్రాంతంలోని మెడికల్ కాలేజీలో మరో 24 మంది మృతి చెందడం విషాదకరమన్నారు. ఈ ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపాని కూడా మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఈ ఘటన యావత్ దేశాన్ని కలచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. దేశంలోనే అతి పెద్ద ప్రమాద ఘటనల్లో ఇది ఒకటన్నారు. ఈ విషాదం నుంచి కోలుకునే ధైర్యాన్ని భగవంతుడు బాధిత కుటుంబాలకు ఇవ్వాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. అలాగే కేంద్రం, అక్కడి రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన ఎన్నైత్రిబుల్‌టీఆర్ శిక్షణ

రాజానగరం: చెన్నైకి చెందిన జాతీయ సాంకేతిక విద్యా శిక్ష మరియు పరిశోధన సంస్థ (ఎన్నైత్రిబుల్‌టీఆర్) సహకారంతో స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో బోధనా సిబ్బందికి ఐదు రోజులుగా ఇస్తున్న శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. పొందిన శిక్షణను బోధనలో వినియోగిస్తూ ఉత్తమ ఫలితాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రొ.వీసీ డాక్టర్ కేవీబీ రాజు సూచించారు. ఎన్నైత్రిబుల్‌టీఆర్ ప్రొఫెసర్స్ రీసోర్స్‌పర్సన్స్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, శిక్షణా తరగతుల కోఆర్డినేటర్ డాక్టర్ డి.రవికిషోర్, గైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయానందకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రాజు

వృద్ధుల రక్షణకు కఠిన చట్టాలు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: సమాజంలో కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమై.. డబ్బు, ఆస్తుల కోసం వృద్ధులపై వేధింపులు పెరుగుతున్నాయని, దీనిని నివారించేందుకు కఠిన చట్టాలు అమలు చేయాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శుక్రవారం స్థానిక సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వృద్ధుల వేధింపుల నివారణకు అవగాహన కరపత్రాన్ని విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ మారిసెట్టి జితేంద్ర, ట్రస్ట్ ప్రతినిధులు చింతా ప్రభాకర్‌రెడ్డి, చింతా ప్రసాదరెడ్డి, డాక్టర్ గుబ్బల రాంబాబు ఆవిష్కరించారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ కరపత్రాన్ని అంతర్జాతీయ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవం సందర్భంగా ఆదివారం సీనియర్ సిటిజన్లకు, వారి కుటుంబాలకు అందిస్తామని స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు తెలిపారు. వృద్ధుల సమస్యలపై అవగాహన కల్పిస్తూ, గత 27 ఏళ్లుగా వృద్ధుల పునరావాస కేంద్రం ద్వారా వృద్ధులను ఆదరిస్తున్నామన్నారు. వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని ఆదివారం స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో జరపనున్నట్లు తెలిపారు. వృద్ధులు వేధింపులకు గురికాకుండా చూడడం అందరి బాధ్యత అని జితేంద్ర తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



పౌష్టికాహారాన్ని తీసుకుంటున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవడంతో పాటు, అందుకనుగుణంగా పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. యోగా కార్యక్రమంలో భాగంగా కానవరంలోని రాపర్తి రామ ఇన్‌స్టిట్యూట్ ఫర్ యోగా కేంద్రంలో పౌష్టికాహారంపై శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కూజి పటాలియా బియ్యంతో అన్నం, కొర్రల పాయసం, అరికెల పులిహోర, పులగం, గుత్తి వంకాయ కూర, మునగాకు కొబ్బరికాయ కూర, సామల పెరుగన్నంతో పాటు, వివిధ రకాల పండ్లతో కూడిన స్వాతికాహార స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిని వీసీ పరిశీలించి, కొన్ని పదార్థాలను రుచి చూశారు. అందుబాటులో లభించే పదార్థాలతోనే పౌష్టికాహారాన్ని తయారుచేసుకోవచ్చన్నారు. అందుకు తగిన శ్రద్ధ, ఓపిక ఉండాలన్నారు. ఆధునిక సమాజంలో ఆ ఓపిక లేకే రెడీమేడ్ ఫుడ్‌లకు ఆకర్షితులై, ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించి రెడీమేడ్ ఫుడ్‌ను సాధ్యమైనంత వరకు దూరంగా ఉండాలని చెప్పారు.

ఆస్తి పన్ను పెంపును ఉపసంహరించాలి

- గృహాలకు స్మార్ట్ మీటర్లు వద్దు
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పవన్



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: అసాధారణంగా ఆస్తి పన్నును పెంచుతూ కూటమి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.పవన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని, ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నేటికీ పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా పన్నుల పెంపు లక్ష్యాలను నిర్దేశిస్తూ ఉత్తర్వులిచ్చి, మరోవైపు ప్రభుత్వం సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు రూ.17.50 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. ఈ భారం ఇంటి యజమానులతో పాటు, అద్దెకున్న వారిపైనా పరోక్షంగా పడుతుందన్నారు. ఇదే అమలైతే ఇంటి యజమానులూ అద్దె చెల్లించిన ట్టేనన్నారు. విద్యుత్ చార్జీలను పెంచబోమంటూనే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రతిపక్ష నేతగా నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని గుర్తు చేస్తూ, అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే.. వాటిని పగలగొట్టాలంటూ ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే జిల్లాలో వాణిజ్య సంస్థలతో పాటు, గృహ వినియోగదారులకు సైతం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు యత్నిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పట్టణాల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి కర్రి రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు బి.పూర్ణిమరాజు, ఐ.సుబ్రహ్మణ్యం, నాయకులు ఎస్ఎస్ మూర్తి, తాతారావు, పడాల రామకృష్ణ, వి.రాంబాబు, సోమేశ్వరరావు, శ్రీను, వెంకటేశ్వరరావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కూలు రెడీనెస్ మేళా ప్రారంభం

కంబాలచెరువు: నారాయణపురం మోడల్ ఫౌండేషన్ స్కూల్‌లో శుక్రవారం స్కూలు రెడీనెస్ మేళా ప్రారంభించారు. విద్యా శాఖ, శిశు సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో పిల్లల అభివృద్ధిలో మెరుగుదల ఏ విధంగా ఉందో పరిశీలించారు. తల్లిదండ్రులకు ఇంటి వద్దే చేయగలిగే సరళమైన కృత్యాలు, పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, సమగ్ర శిక్షా ఏఎంవో గౌరీశంకరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మోహనలక్ష్మి, ప్రథమ్ సభ్యులు కన్నయ్య నాయుడు, చిన్నిబాబు, గున్నాబత్తుల అనూష, పాఠశాల హెచ్ఎం జయలక్ష్మి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎత్తు వేస్తే చిత్తే..

- చదరంగం పోటీల్లో రాణిస్తున్న నగర క్రీడాకారులు
- రాష్ట్ర స్థాయి పోటీలకూ ఎంపిక



పీయూష్ శ్రీపార్థు

ప్రకాశం నగర్: ప్రత్యర్థిని చిత్తు చేసి విజయం సాధించే చదరంగం ఆటలో చిన్నారులు, యువత తమదైన శైలిలో దూసుకుపోతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికవ్వడంతో పాటు, పతకాలూ సాధిస్తున్నారు. రాజు, మంత్రి, సైన్యాధిపతులు, సైనికులు, అశ్వ, గజాదళాలు ఉండే ఈ ఆటలో ఎత్తుకు పైఎత్తు వేసి ప్రత్యర్థిని చిత్తు చేస్తున్నారు. ఇటీవల ది రాజమండ్రి ఐరన్ హార్డ్‌వేర్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పురుషుల ఓపెన్ చదరంగం పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో రాజమహేంద్రవరానికి చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో తొలి నలుగురు విజేతలు వారం రోజుల క్రితం విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించారు.

రాష్ట్ర స్థాయికి..

చదరంగం పోటీల్లో జిల్లా స్థాయి పురుషుల ఓపెన్ విభాగంలో వి.సుజన్‌కుమార్, సీహెచ్ సూర్య గీతేష్, శ్రీఇషాంత్, వి.భువన్‌సాయి జశ్వంత్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరితో పాటు, ఇటీవల విడుదల చేసిన ఇంటర్నేషనల్ చెస్ ఫీడే రేటింగ్స్‌లో నగరానికి చెందిన హేమచంద్ 1406, పీయూష్ శ్రీపార్థు 1407, వాకలపూడి లతిక 1435, ఉషశ్రీ 1465 ర్యాంకులు సాధించారు.

మానసిక ఒత్తిడి దూరం

చదరంగం ఆడటం వల్ల మెదడులో జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు, మరింత చురుగ్గా పనిచేస్తుంది. ముఖ్యంగా విద్యార్థుల్లో చదువు కారణంగా ఏర్పడే మానసిక ఒత్తిడి దూరమై, సమస్యలను అధిగమించే సామర్థ్యం, పోటీతత్వం అలవర్చుతుందని క్రీడా నిపుణులు చెబుతున్నారు. ఐక్యూ, పెరడగంతో పాటు, అతిగా మతిమరుపు ఉన్న చిన్నారులకు చదరంగం మంచి ఔషధంగా పనిచేస్తుంది. పిల్లల్లో సృజనాత్మకత పెరగడంతో పాటు, వారికి మానసికోల్లాసం చేకూరుతుందని మానసిక నిపుణులు చెబుతున్నారు.



రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మంచి గుర్తింపు ఉంది



ప్రపంచ వ్యాప్తంగా చదరంగం ఆటకు మంచి గుర్తింపు ఉంది. ఆలోచనా శక్తిని మెరుగుపర్చుకునేందుకు చదరంగం ఎంతో దోహదపడుతుంది. జిల్లా చదరంగం సంఘం ద్వారా అనేక మంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికవ్వడంతో పాటు, పతకాలు కైవసం చేసుకోవడం గర్వకారణం. గతంతో పోలిస్తే ఇప్పుడు చిన్నారులు, యువత చదరంగం ప్రాధాన్యాన్ని గుర్తించి, ఆటలో మెళకువలు నేర్చుకుంటున్నారు.

– జీవీ కుమార్, కార్యదర్శి, జిల్లా చదరంగం సంఘం

ఆనందంగా ఉంది



ఇంటర్నేషనల్ చెస్ ఫీడేలో 1406 రేటింగ్ రావడం ఆనందంగా ఉంది. కోచ్ విత్తనాల కుమార్‌కు చెందిన క్యాల్బ్యాజన్ చెస్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాను. చదరంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై చదరంగం ఆడి మంచి గుర్తింపు తెచ్చుకోవడమే నా లక్ష్యం.

– హేమచంద్, చెస్ క్రీడాకారుడు

రక్తదానంపై అవగాహన



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాజానగరం: రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి సహకారంతో స్థానిక గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామచంద్రన్ మాట్లాడుతూ, రక్తదానం ఆవశ్యకతను, తద్వారా వ్యక్తిగతంగాను, సామాజికంగాను కలిగే ప్రయోజనాలను వివరించారు. 18 ఏళ్లు నిండిన ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానానికి సంబంధించి ఆన్‌లైన్‌లో ఈ.రక్తకోష్ వెబ్‌సైట్‌లో ఎలా పేరు నమోదు చేసుకోవాలో సహాయ అధ్యాపకురాలు డాక్టర్ ఏఎల్ శ్వేత వివరించారు. ఈ సందర్భంగా రక్తదానంపై అవగాహన కలిగిస్తూ ముద్రించిన పోస్టర్‌ను విడుదల చేశారు.

విమాన ప్రమాదంపై విచారం

రాజానగరం: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన దుర్ఘటనపై స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్, శాసన మండలి మాజీ విప్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) శుక్రవారం ఇక్కడ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వృద్ధులకు భోజన వితరణ

అనపర్తి: రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు అల్పాహారం, భోజనాలు వితరణ చేశారు. కోస్తాంధ్రా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక తేతలి రామిరెడ్డి, మంగయమ్మ మహిళా వృద్ధాశ్రమంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

కోరుకొండ: పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత స్థానాలను అధిరోహించాలన్న ఉద్దేశంతో మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ కుమారుడు అభిరామ్ శుక్రవారం ఇద్దరికి ఆర్థిక సాయం అందజేశారు. కోరుకొండలో జరిగిన కార్యక్రమంలో మండలంలోని కణుపూరుకు చెందిన షణ్ముఖేశ్వరి, సీతానగరం మండలం మిర్తిపాడుకు వై.ప్రైసీకి రూ.20 వేల చొప్పున అందించారు.

అత్యవసర సమయంలో ఆదుకునే శక్తి యాప్

తూర్పు జోన్ డీఎస్పీ విద్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విద్య

రాజమహేంద్రవరం రూరల్: మహిళలు అత్యవసర సమయాల్లో శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని, ఈ యాప్ మహిళ, యువతుల భద్రత కోసమే ప్రత్యేకంగా రూపొందించిందని తూర్పు జోన్ డీఎస్పీ బి.విద్య అన్నారు. శుక్రవారం బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శక్తి యాప్‌పై మాట్లాడారు. ప్రతి మహిళ కచ్చితంగా శక్తి యాప్‌ను తమ సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్న వారి సెల్‌ఫోన్ నేరుగా కంట్రోల్ రూమ్‌కు కనెక్ట్ అవుతుందన్నారు. ప్రమాద సమయంలో ఎస్‌వోఎస్ బటన్‌పై నొక్కి, సెల్‌ఫోన్‌ను ఐదు సార్లు షేక్ చేస్తే ప్రమాదంలో ఉన్నట్లు కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వస్తుందన్నారు. దీంతో సమీపంలోని పోలీసులు ఐదు నిమిషాల్లో బాధిత మహిళల వద్దకు వచ్చి సహాయం చేస్తారని వెల్లడించారు. అంతేకాకుండా ఇంటిలో నుంచి ఫిర్యాదులు చేయవచ్చని, మిస్సింగ్ కేసు ఫిర్యాదులు ఈ యాప్ ద్వారా చేయవచ్చని వివరించారు. రాత్రి వేళల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు నియర్ బై షెల్టర్ బటన్ ప్రెస్ చేస్తే, ఆయా ప్రాంతాల్లోని సురక్షిత ప్రదేశాలు చూపిస్తాయని తెలిపారు. మహిళల రక్షణ కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథం, వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ సౌజన్య పాల్గొన్నారు.